క్లుప్తంగా

11న ఐటీఐ అప్రంటీస్ మేళా

మాచర్ల: పల్నాడు జిల్లా మాచర్ల ప్రభుత్వ గురుకుల పారిశ్రామిక శిక్షణ (ఐటీఐ) కళాశాలలో ఈ నెల 11న ఉదయం 10గంటలకు అప్రంటీస్ మేళా జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఐటీఐ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని ట్రేడ్‌ల విద్యార్థులు ఈ అప్రంటీస్ మేళాలో అవకాశాలు పొందాలన్నారు. వివిధ రకాల కంపెనీలు అప్రంటీస్ మేళాకు హాజరవుతాయని, వచ్చే బుధవారం జరిగే ఈ మేళాను ఐటీఐ చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సంప్రందించాలన్నారు.

మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ



దాచేపల్లి: వరదబారిన పడిన మత్స్యకారులకు దుప్పట్లను పంపిణీ చేశారు. మండలంలోని రామాపురం మత్స్యకారులకు నారాయణపురానికి చెందిన నవ సమారిటన్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు జి.బుల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు అందజేశారు. తహసీల్దార్ వైపీ కుటుంబరావు చేతుల మీదుగా 60 మత్స్యకారుల కుటుంబాలకు దుప్పట్లను అందించారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు తాము ఆపదలో ఉన్న మత్స్యకారులకు దుప్పట్లు అందజేశామని బుల్లయ్య చెప్పారు. ఎంపీడీఓ శోభారాణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, సర్పంచ్ వీర్ల రామకోటయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గురజాల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రుక్సానా సుల్తానా బేగం అన్నారు. స్థానిక వెంకటరావు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం ఎలా తయారుచేసుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సరుకులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ వై.రత్నకుమారి, అంగన్‌వాడీలు భాగ్యలక్ష్మి, రాణీ, దేవకుమారి, ఉమామల్లేశ్వరి పాల్గొన్నారు.

వెల్దుర్తిలో...

వెల్దుర్తి: పోషకాహార మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలో ఘనంగా జరిగాయి. మండాదిలో పోషకామార ప్రయోజనాలపై అవగాహన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఎస్.కుమారి, రుక్మిణి, విజయలక్ష్మి, అన్నపూర్ణ, జయభారతి పాల్గొన్నారు.

విజయవాడ తరలిన పారిశుద్ధ్య కార్మికులు

మాచర్ల: విజయవాడలో వరదలు ముంచెత్తటంతో ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేయటానికి రాష్ట్రవ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల నుంచి పారిశుద్ధ్య కార్మికులు విజయవాడకు తరలుతున్నారు. విజయవాడలో వీరికి వారం రోజులు ప్రత్యేక డ్యూటీలు వేశారు. మాచర్ల మున్సిపాలిటీ నుంచి 20 మంది పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి పంపారు. పారిశుద్ధ్య కార్మికులు విజయవాడకు పంపుతూ మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ నాగేశ్వరరావులు పలు సూచనలు చేశారు.

9న అతిథి అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూ

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదిన అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి బుధవారం తెలిపారు. కామర్స్-2 పోస్టులు, ఎకనామిక్స్-1, తెలుగు-1, మ్యాథ్స్-1, కెమిస్ట్రీ-1, కంప్యూటర్ సైన్స్-1 మొత్తం 7 పోస్టులకు ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులను కలిగి ఉండాలన్నారు. ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ నెట్, ఏపీ సెట్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు చెప్పగలిగే అభ్యర్థులే అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 9వ తేదీ ఉదయం 10గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆసక్తిగల వారు aprdc.nagarjunarafar@gmai.com కు రెజ్యూమ్ పంపించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7036318863 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

వెనుకబడిన ప్రాంతంలో విద్యాభివృద్ధి

35 ఏళ్లుగా మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో విద్యాబోధన చేస్తున్న ఐవీ నాగమణి

- ఉత్తమ ఫలితాల సాధన
- మూడుసార్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక
- అనేక సంస్థల నుంచి సత్కారాలు



వైఎస్సార్ స్మారక అవార్డును అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అందుకుంటున్న ఐవీ నాగమణి (ఫైల్)

మాచర్ల: మూడు దశాబ్దాల క్రితం మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తి, మాచర్ల, దుర్గి మండలాలలో నక్సలిజం, ఫ్యాక్షనిజం ప్రభావం తీవ్రంగా ఉండేది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగం చేసేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాని పరిస్థితి ఉండేది. ఈ ప్రాంతం వారు సైతం బయటకు వెళ్లి ఉద్యోగాలు చేసేందుకు మొగ్గు చూపేవారు. ఉపాధ్యాయులు రాక, విద్యార్థులు లేక, పాఠశాలలు సరిగా నడవక ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి కుంటుపడింది. అటువంటి సమయంలో గుంటూరుకు చెందిన ఐవీ నాగమణి 1989లో సెప్టెంబర్‌లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. తాను పల్నాడు ప్రాంతంలోని మాచర్ల మండలంలోని కానీ, వెల్దుర్తి మండలంలోగానీ పనిచేస్తానని సెలక్షన్‌లో ఆమె కోరుకున్నారు. తోటి ఉపాధ్యాయులు ఎంత చెప్పినా వినకుండా వెనుకబడిన ప్రాంతంలో ఉద్యోగం చేసేందుకే మొగ్గుచూపారు.

ఇంటివద్ద ఉచిత ప్రత్యేక తరగతులు

ఈక్రమంలో కొప్పునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. పాఠశాలకు వెళ్లామా.. పాఠాలు చెప్పామా.. ఇంటికి వచ్చామా అన్నట్లు కాకుండా స్కూలు సమయం ముగిసిన తర్వాత గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చక్కగా చదువుకుంటే కలిగే మేళ్లను, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వారికి అర్థమయ్యేలా వివరించారు. ఈక్రమంలో పాఠశాలకు విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరిగింది. వారికి పాఠశాల సమయం అనంతరం తన ఇంట్లోనే ఉచితంగా క్లాసులు నిర్వహించి, వారికి పాఠాలు మరింత అర్థమయ్యేలా బోధించేవారు. ఈ విధంగా 11ఏళ్లపాటు అదే పాఠశాలలో పనిచేసి అనేకమందికి నూతన అడ్మిషన్లు ఇప్పించి, విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకులుగా చేశారు.

ఉత్తమ ఫలితాలు..

అక్కడ నుంచి 2000 సంవత్సరంలో విజయపురిసౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లి ఇన్‌ఛార్జి హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఐదు సంవత్సరాల పాటు ఆ పాఠశాల అభివృద్ధికి కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించారు. 2009లో మాచర్ల బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందారు. తన విధులు నిర్వర్తిస్తూనే సైన్స్ బోధనలోనూ ఉత్తమంగా పనిచేసి అనేక సార్లు 100/100 ఫలితాలను సాధించి అవార్డులు పొందారు. 2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టుల్లోనూ, క్రీడల్లోనూ జిల్లా, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. మాచర్ల బాలికోన్నత పాఠశాలలో ఆమె విధుల్లో చేరినప్పుడు 570 మంది విద్యార్థినులు ఉండగా నేడు ఆ సంఖ్య 1200కు చేరింది. పదిలో నూరు శాతం సాధించడం ఈ పాఠశాల ప్రత్యేకత. కఠోర శ్రమ, లక్ష్య సాధనపై గురితోనే ఉత్తమ ఫలితాల సాధనకు కారణమయ్యాయని నాగమణి తెలిపారు.

అవార్డులు.. రివార్డులు

అనంతరం కంభంపాడు జడ్పీహెచ్‌ఎస్‌కు హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తూ జిల్లా స్థాయిలో సప్తాహ్ అవార్డును అప్పటి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి ఐదుసార్లు రామినేని ఫౌండేషన్ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా సత్కారం పొందారు.

- మాచర్ల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు చక్కగా చేయించి జిల్లా స్థాయిలో అవార్డును పొందారు.
- ఆ తరువాత 2003లో తాను టీచర్‌గా మొదట పనిచేసిన కొప్పునూరుకు బదిలీపై హెచ్‌ఎంగా వెళ్లి ఇప్పటికీ అక్కడే పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛ విద్యాలయ్ కింద నాడు-నేడు పనులు బాగా చేయించినందుకు అప్పటి జిల్లా కలెక్టర్ , డీఈఓల చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డును అందుకున్నారు.
- మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 2010లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ స్మారక అవార్డుకు నాగమణి ఎంపికై, పీఆర్కే చేతులమీదుగా అవార్డును అందుకున్నారు.



ఉమ్మడి గుంటూరు జిల్లా డీఈఓ చేతులమీదుగా స్వచ్ఛ్ విద్యాలయ పురస్కారాన్ని అందుకుంటూ..(ఫైల్)

ఇక్కడ పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది..



పల్నాడు ప్రాంతంలో పనిచేయడం నాకెంతో సంతృప్తినిచ్చింది. నేను గుంటూరు ప్రాంతంలో జన్మించాను. డీఎస్సీలో సెలెక్ట్ కాగానే వెనుకబడిన పల్నాడులో పనిచేయాలని కోరుకున్నాను. అక్కడికి వెళితే ఇబ్బందులు ఎదుర్కొంటావని చాలా మంది చెప్పారు. నేను వచ్చి చేరినప్పుడు ఉపాధ్యాయ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. 35 ఏళ్లగా వెల్దుర్తి, మాచర్ల మండలాల్లో ఎంతో సంతృప్తికరంగా పనిచేశాను. నా భర్త సత్యనారాయణకూడా ఉపాధ్యాయుడే. ఆయన సహకారంతో నిరంతరం విద్యాభివృద్ధికి కృషి చేశాను. ఎంతో మందిని తీర్చిదిద్దాననే సంతృప్తి మిగిలింది.

– ఐ.వి.నాగమణి, ప్రధానోపాధ్యారాలు, కొప్పునూరు జెడ్పీహెచ్ఎస్

వరద బాధితులకు 'పరాశక్తి' చేయూత



రెంటచింతల: వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులకు సత్రశాల పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం చేయూత నందించడం అభినందనీయమని డీఆర్‌ఓ కె.వినాయకం అన్నారు. బుధవారం పరాశక్తి యాజమాన్యం 5 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 5 వేల వాటర్ బాటిళ్లు, 100 దుప్పట్లను వరద బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రాంతంతో సంబంధం లేకుండా వరదల కారణంగా కష్టాలలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఆహారం, తాగునీరు, మెడికల్ కిట్లను అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. తహసీల్దార్ కె.కరుణ కుమార్, ఫ్యాక్టరీ పర్సనల్ మేనేజర్ కేసర వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని 220/132 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎ.శివనాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలకల్లు, జానపాడు, పిడుగురాళ్ల, అనుపాలెం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు గమనించగలరని ఆయన తెలిపారు.

వాసవీ అమ్మవారి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన నూతన దేవాలయ అభివృద్ధి కమిటీ బుధవారం దేవస్థాన ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు ఆలయంలో వాసవీ అమ్మవారిని ప్రత్యేకంగా పూజించి, అభిషేకాలు జరిపి నూతన కమిటీ విజయవంతంగా పనిచేయాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, నూతన కమిటీ అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సన్నిధి హనుమంతరావు, కోశాధికారి మాశెట్టి వెంకట సైదారావు, ఉపాధ్యక్షులు గోళ్ల జనార్ధనరావు, కూనిశెట్టి చిన వెంకటేశ్వర్లు, గుండా వెంకట మల్లిఖార్జునరావు, పోలూరి సత్యనారాయణ, తుమ్మేపల్లి అంకేశ్వరరావు, రంగా జనార్ధనరావు, మారం సత్యనారాయణ, చిన్ని చంద్రశేఖర్‌రావులను, సహాయ కార్యదర్శులుగా తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కొత్తమాసు చెన్నకేశవరావు, భవనాశి రవితేజ, కొత్తా శ్రీదేవి, పరిటాల ధనలక్ష్మి, వేముల విజయలక్ష్మి, మేడా వెంకటలక్ష్మి, చిన్ని ఆదిలక్ష్మిలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారానికి మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, పెద్దలు సూరె యలమంద, కొత్తమాసు బ్రహ్మారావు, భవనాశి గోవిందు, శ్రీను, రంగా సత్యం, చెన్నయ్య, పోలా సత్యం, కంభంపాటి అమర్, కొత్తమాసు మోహన్, కాశి పెద్దలు, ఆర్యవైశ్య సంఘ నాయకులు తదితరులున్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి



గురజాల సీఐ పి.భాస్కర్

- వినాయకుని మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి
- నిమజ్జన సమయంలో వీడియో కెమెరాలు ఉండాలి
- మండపం ఏర్పాటుచేసే స్థలంలో ఎటువంటి వివాదాలు జరగరాదు

గురజాల: ఈనెల 7వ తేదీన జరిగే వినాయక చవితి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ పి.భాస్కర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చవితి మండపం అనుమతులకు సింగిల్ విండో పద్ధతిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, వెంటనే అనుమతులను ఆన్‌లైన్ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనుమతులకు సంబంధించిన నియమ నిబంధనలు వెల్లడించారు.

- మండపంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేయరాదు
- మతాలకు సంబంధించిన ఘర్షణలకు పాల్పడరాదు
- నిమజ్జన వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనకూడదు
- నిమజ్జన సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులు ఉండకూడదు
- డీజే ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి
- ముందుగానే నిమజ్జనం రూటును పోలీసులకు తెలపాలి
- బాణ సంచా కాల్చకూడదు

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

- జ్వర లక్షణాలు కనబడితే వైద్యశాలలో చికిత్స పొందండి
- ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఉదయ భాను



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను, డాక్టర్ కేపీ చారి

మాచర్ల: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను, అసిస్టెంట్ సూపరిండెంట్ డాక్టర్ కేపీ చారీ కోరారు. బుధవారం ప్రభుత్వాసుపత్రిలో వారు విలేకరులతో మాట్లాడుతూ జ్వరాల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వలన దోమలు పెరిగి వాటి కాటుకు గురైన వారు అనేక రకాల విష జ్వరాలకు గురవుతున్నారన్నారు. దోమల వలన మలేరియా, టైఫాయిడ్ ప్రబలుతాయన్నారు. అదేవిధంగా డెంగీ వంటివి వస్తాయన్నారు. మాచర్ల ప్రాంతంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం, నీటి నిల్వ లేకుండా చూడటం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరాలు, అతిసార లక్షణాలు కనబడిన వెంటనే వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. జ్వరం వచ్చాక ఆలస్యం చేస్తే డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు పెరుగుతాయన్నారు. ప్రజలు అవగాహన కలిగి వెంటనే వైద్యం పొందేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో 24గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మెరుగైన వైద్యం పొందాలన్నారు.

నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలపై కేసులు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపడుతున్న లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ కమిటీ సభ్యులు

సత్తెనపల్లి: రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ జిల్లాలలో తనిఖీలు నిర్వహించి నిబంధనలను పాటించని కంపెనీలు, దుకాణాలపై కేసు నమోదు చేయించడం జరిగిందని లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ కమిటీ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలపై బుధవారం దాడులు నిర్వహించారు. గాంధీచౌక్ సెంటర్‌లోని ఎరువులు దుకాణాలలో మందుల డబ్బాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నవో లేవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో తనిఖీలు నిర్వహించామని, త్వరలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలసి అన్ని హోటళ్లు, రెస్టారెంట్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటను కూడా తనిఖీ చేయడం జరుగుతుంద న్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ పల్నాడు జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.అల్లూరయ్య, సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షైక్ సైదా, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు



పిల్లేరు వాగులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

పిడుగురాళ్ల: మండలంలోని కోనంకి గ్రామంలోని పిల్లేరు వాగులో గల్లంతైన శీలం శ్రీనివాసరావు కోసం పట్టణ పోలీసులు బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఇసుక మేట వేసిన నీటి మోటారును వెలికితీసేందుకు పిల్లేరు వాగులో దిగిన శ్రీనివాసరావు వాగు ప్రవాహ ఉధృతికి గల్లంతయ్యాడు. బుధవారం రాత్రివరకు గాలించినా ఆచూకీ దొరకలేదని పట్టణ ఎస్ఐ ఎం.మోహన్ తెలిపారు. గజ ఈతగాళ్లతో, ప్రత్యేక పడవల సహాయంతో, తాళ్ల సహాయంతో గల్లంతైన ప్రాంతంతోపాటు నీటి ప్రవాహ ప్రాంతాల్లో కూడా గాలింపు చర్యలు చేపట్టటం జరిగిందన్నారు. పిల్లేరు వాగులో మొసళ్లు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

వరద బాధితుల కోసం ఆహారం, నీళ్ల బాటిళ్లు



వాటర్ బాటిళ్లను లారీని పంపుతున్న తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది

కారెంపూడి: వరద బాధితుల సహాయార్థం మినరల్ వాటర్ బాటిళ్లతో నిండిన లారీని మండల తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ తరలించారు. కలెక్టర్, ఆర్డీఓ పిలుపు మేరకు తహసీల్దార్ ప్రసాద్, డీటీ కీర్తి సుధా స్రవంతి, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు తమ వంతు సాయంగా వీటిని పంపారు. అలాగే వెలుగు జిల్లా కో-ఆర్డినేటర్ ఇచ్చిన పిలుపు మేరకు మండల వెలుగు సిబ్బంది ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను ఆటోలో విజయవాడకు తరలించారు.

విజయపురిసౌత్ ఎస్ఐగా మహమ్మద్ షఫీ



విజయపురిసౌత్: విజయపురిసౌత్ నూతన ఎస్ఐగా షేక్ మహమ్మద్ షఫీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మహమ్మద్ షఫీ క్రోసూరు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు విజయపురిసౌత్ ఎస్ఐగా పనిచేసిన పట్టాభి రామయ్య బాపట్ల జిల్లా సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎస్ఐ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎస్ఐ షఫీని ఏఎస్ఐలు సోమ్లా నాయక్, సోమయ్య, పోలీస్ సిబ్బంది అభినందించారు.

కాపు యువసేన నియోజకవర్గ అధ్యక్షుడిగా దుర్గారావు

దాచేపల్లి: కాపు యువసేన గురజాల నియోజకవర్గ అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన మండపాటి దుర్గారావు నియమితులయ్యారు. ఈ మేరకు కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కర్రా శ్రీనివాసరావు నియమక పత్రాన్ని తనకు బుధవారం అందజేసినట్లు దుర్గారావు తెలిపారు. నియోజకవర్గంలో కాపుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, కాపుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని దుర్గారావు చెప్పారు. దుర్గారావు నియమకంపై పలువురు అభినందనలు తెలిపారు.

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

పిడుగురాళ్ల: కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ టి.ప్రసన్న అన్నారు. పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన కల్పించి, రక్తశాతం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కిశోర బాలికలకు ఈ దశ ఎంతో ముఖ్యమైనదని, దీని వలన ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని, సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేసి వారి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. సరైన పోషణ, శుభ్రత పాటించాలని ఆమె సూచించారు. కృష్ణారెడ్డి, మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్టు

మాచర్ల: పట్టణంలో జెండా చెట్టు వద్ద ఫిబ్రవరి 28వ తేదీన జరిగిన ఇరు వర్గాల ఘర్షణకు సంబంధించి వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు 10 మందిని పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఫిబ్రవరి 28వ తేదీ తమపై దాడి జరిగిందని టీడీపీకి చెందిన వ్యక్తి మాచర్ల కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయటం జరిగింది. ఈ కేసుకు సంబంధించి విచారించి చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసులకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసులు 19 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో బుధవారం అర్బన్ సీఐ పి.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో 10 మందిని అరెస్టు చేసి మాచర్ల సివిల్ జడ్జి కోర్టులో క్రిమినల్ బెంచి జడ్జి పి.ప్రశాంత్ ముందు హాజరు పర్చగా ఆయన రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.